క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


వర్షిత

గడివేముల: స్థానిక మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 564 మార్కులు సాధించిన కేవీ వర్షిత ఇటీవల జరిగిన చివరి విడత కౌన్సెలింగ్‌లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన చంద్రుడు, శకుంతలమ్మ దంపతుల కుమార్తె వర్షిత 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళం జిల్లాలోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ మేరకు వర్షితను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇసుక లేక ఇక్కట్లు

పాణ్యం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఇసుక పాలసీ రూపొందించే క్రమంలో ఇసుక సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి ఇసుక అందక నిర్మాణ కార్మికులు, యజమానుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఏ రీచ్ నుంచి కూడా ఇసుక సరఫరా కావడం లేదు. అంతేగాక అక్కడక్కడ డిపోల్లో ఉన్న ఇసుక నాలుగు టన్నులు రూ.8 వేలకు పైగా ఉంది. ప్రభుత్వం సరఫరా చేయక, రీచ్‌ల వద్ద ఇసుక దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల ఇసుక కొరతతో భవన నిర్మాణాలు ఆపేశారు. అంతేగాక నూతన ఇసుక పాలసీ ఇంకా అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా చర్యలు చేపట్టి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కోడుమూరు రూరల్: కోడుమూరు–ఎమ్మిగనూరు రహదారిలోని వర్కూరు పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాలు.. ఆదోనికి చెందిన ఇస్మాయిల్, అబిదాబి బేగం మరో ముగ్గురితో కలిసి కర్నూలు నుంచి ఆదోని వైపు కారులో వెళుతున్నారు. మార్గమధ్యలోని వర్కూరు పెట్రోల్ బంకు వద్ద ఆదోని నుంచి కర్నూలు వైపు వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇస్మాయిల్, అబిదాబి బేగంలకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కల్లూరు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా కర్నూలులోని రాగమయూరిలో పారిశ్రామికవేత్త కేజీ రెడ్డి, డ్యాన్స్ మాస్టర్ రామకృష్ణ, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజానికి మదర్ థెరిస్సా చేసిన సేవలు ఎనలేనివన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సి.సత్యనారాయణమ్మ శిబిరం నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. మదర్ థెరిస్సా ట్రస్టుకు సంబంధించి సేవలు అందించిన వారికి అవార్డులు అందించారు. డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 36వ వార్డు వాసవీ నగర్‌లో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సెలవులో వెళ్లిన ఏడీఏ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సహాయ సంచాలకులు ఎస్.సాలురెడ్డి సెల వుల్లో వెళ్లారు. విదేశాలకు వెళ్లేందుకు అనుమ తి కోసం ఈయన కొద్ది రోజుల క్రితం దరఖా స్తు చేసుకున్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. సెప్టెంబరు 30వ తేదీ వరకు ఆయ న విదేశీ పర్యటనలో ఉంటారు. ఈ స్థానంలో కార్యాలయ టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న దస్తగిరిరెడ్డిని తాత్కాలికంగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఈ మేరకు వ్యవసా య శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీఓబీ శాఖ తరలింపు

కర్నూలు(అగ్రికల్చర్): గూడూరు మండలం పెంచికలపాడులోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) శాఖను నూతన ప్రాంగణంలోకి మార్పు చేస్తున్నట్లుగా బ్రాంచ్ మేనేజర్ బి.రమేష్‌బాబు తెలిపారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న రాహుల్ ఇంద్రప్రస్థ నగర్‌లోని ప్లాట్ నెంబర్–1లోకి మార్పు చేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన భవనం ప్రారంభోత్సవ మంగళవారం ఉంటుందని వెల్లడించారు.

ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించలేరా?



నేను 1980 నుంచి బోధనాసుపత్రిలో నైట్‌డ్యూటీలు చేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యుల పరిస్థితిలో ఏ మార్పు లేదు. వారికి రెస్ట్‌రూమ్స్, వాష్‌రూమ్స్, సెక్యూరిటీ, సరైన లైటింగ్స్ ఉండటం లేదు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇన్ని సమస్యలు లేవు. కోల్‌కతాలో జరిగిన ఘటన వల్ల మళ్లీ ఈ సమస్యలపై మాట్లాడుతున్నారు. కొన్నాళ్లకు మళ్లీ అన్నీ మరిచిపోయి ఎవరి పనుల్లో వారుంటారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలి. మెడికల్ కాలేజీలు, టెరిటరీ కేర్ సెంటర్లలో పోలీస్ భద్రతను పెంచాలి. సీఆర్‌పీఎఫ్, సెంట్రల్ ఫోర్స్, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ వంటి వాటితో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. పీజీ వైద్యులు రోగులకు ప్రాణం పోయగలరు గానీ, వారి ప్రాణాలు ఫణంగా పెట్టలేరు కదా. వారు లేవనెత్తిన అంశాలన్నీ సరైనవే. వారికి అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు తక్షణమే కల్పించాలి.

–డాక్టర్ బి.శంకరశర్మ, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు



అధిక పని గంటలతో ఒత్తిడి



ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పీజీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వర్కింగ్ అవర్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఒక్కోసారి వారు నిరంతరంగా 24 గంటల నుంచి 36 గంటల దాకా పనిచేస్తూనే ఉంటారు. దీనివల్ల వారిలో తీవ్ర మానసిక ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు రోగి మరణిస్తే వారి కుటుంబసభ్యులు బావోద్వేగంతో దాడి చేస్తుంటారు. ఇలాంటి సమయంలో పోలీసు ప్రొటెక్షన్ ఉంటే దాడులు జరగకుండా ఉంటాయి. దాడికి పాల్పడిన వారికి సరైన శిక్ష అమలు చేయాలి. దీనివల్ల వైద్యులకు ధైర్యం, మానసిక స్థైర్యం కలుగుతుంది. వారు ధైర్యంగా పనిచేయడంతో పాటు వారిలోని నైపుణ్యాన్ని ఉపయోగించి రోగులకు ప్రాణదానం చేయగలుగుతారు. అమెరికాలో ప్రతి ఆసుపత్రిలో పోలీస్ ప్రొటెక్షన్ ఉంటుంది. అక్కడ ఎవరైనా మరణిస్తే దాడులు జరగవు. ఇక్కడ గుంపులుగా గుంపులుగా చూడటానికి వస్తారు. ఎవ్వరినీ ఏమీ అనలేని పరిస్థితి ఉంటుంది. ఆసుపత్రిలో సౌకర్యాలు మరింత మెరుగుపడాల్సి ఉంది.

–డాక్టర్ పి.సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్యులు, కర్నూలు


లొద్దిపల్లెలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు


రెమడూరులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


కోడుమూరు: శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు


ఓర్వకల్లులో భజన చేస్తున్న బృంద సభ్యులు

జయకృష్ణా.. ముకుందా.. మురారీ

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- వీరనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా కల్యాణ మహోత్సవం


శ్రీ కృష్ణ ఆలయంలో ఉత్సవమూర్తులు


సి.బెళగల్: గొల్లలదొడ్డిలో పూజలందుకున్న శ్రీకృష్ణుడు


గొల్లలదొడ్డిలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

పాణ్యం: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా ఆలయాలకు ప్రత్యేక అలంకరణల ద్వారా కొత్త శోభ సంతరించుకుంది. పాణ్యంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని వీరనారాయణ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈఓ సువర్ణ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీకృష్ణావతారంలో ఉన్న వీరనారాయణ స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. భక్తులు కనులారా వీక్షించి పులకించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

● అలాగే శ్రీకృష్ణ దేవాలయ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకల్లో పలు ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు కోలాటం, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

● కందికాయపల్లె గ్రామ సమీపంలోని కృష్ణమ్మ కోనలో వెలసిన శ్రీకృష్ణ దేవాలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయానికి సిమెంట్ నగర్, కొణిదేడు, కందికాయపల్లె, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కల్యాణ మహోత్సవం జరిపారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా ఊరేగింపు

కల్లూరు: కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో చూపరులను అలరించారు. మండల పరిధిలోని రెమడూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, కల్లూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ఊరేగింపు కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. గ్రామంలో పాత పంచాయతీ కార్యాలయం వద్ద కృష్ణుడిని కొలువుదీర్చి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో అంగరంగా వైభవంగా ఊరేగింపు జరిగిందని కల్లూరు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఓబులేసు, పురుషోత్తం, సభ్యులు అనిల్, గంగాధర్, శేషయ్య, ఈశ్వరయ్య, సుధాకర్, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం ఓర్వకల్లు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, నన్నూరు తదితర గ్రామాలలో కృష్ణుడి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వాముల వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఓర్వకల్లులో జాతీయ రహదారి పక్కన గల గోపాల స్వామి దేవస్థానంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అర్చకులు నారాయణరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక చెన్నకేశవస్వామి భజన మండలి వారు హే కృష్ణా.. ముకుందా..మురారి అని ఆలపించిన భజన గీతాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. నన్నూరులోని వాల్మీకి సత్రంలో కృష్ణుడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. లొద్దిపల్లె శివారులో కర్నూలు రోడ్డు పక్కన వెలసిన రాధాకృష్ణ దేవాలయంలో అర్చకులు రాజశేఖరశర్మ స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉయ్యాలవాడ శ్రీకృష్ణ దేవాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా చిన్నారుల కోలాటం ప్రదర్శన చూపరులను అలరించింది.

భక్తిశ్రద్ధలతో గోకులాష్టమి వేడుకలు

సి.బెళగల్: కృష్ణాష్టమి వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గొల్లలదొడ్డి గ్రామంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూరహారతులు ఇచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో గోపూజ చేశారు. అదే విధంగా గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, సంగాల, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాల్లో పూజలు జరిగాయి.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కోడుమూరు రూరల్: కృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరు యాదవవీధిలోని శ్రీకృష్ణ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఆవరణలో యాదవ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే పోటీల్లో చిన్నా, పెద్దా ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. సాయంత్రం శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల మీదుగా మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని దాత, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కృష్ణాష్టమిని పురస్కరించుకుని కోడుమూరులో యాదవ సంఘం సభ్యులు ముగ్గుల పోటీలు, కబడ్డీ, బాలురకు పరుగుపందెం, బాలికలకు కుర్చీల పోటీలను నిర్వహించారు. విజేతలకు దాతల సహకారంతో నగదు బహుమతులను అందజేశారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఈఓ సువర్ణ, పాల్గొన్న భక్తులు

పాణ్యం: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక వీరనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కనులవిందుగా జరిగింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి ఈఓ సువర్ణ హాజరై నూతన వస్త్రాలు సమర్పించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలతో కల్యాణ తంతును నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించి పులకించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం జరిపించారు.

సంక్షేమ హాస్టల్ తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఈఈ లక్ష్మీనారాయణ

ఓర్వకల్లు: వసతి గృహాలలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని వసతి గృహాల ప్రత్యేకాధికారి, సంక్షేమ శాఖ ఈఈ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. వసతి గృహాల తనిఖీలలో భాగంగా ఆయన సోమవారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వంటగది, సరుకుల గది, హాస్టల్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వసతి గృహంలో విద్యార్థినుల సంఖ్యకు సరిపడా గదులు ఉన్నాయా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? మరుగుదొడ్లు, స్నానపు గదుల కొరత ఉందా? అనే అంశాలపై విద్యార్థినులను ఆరాతీశారు. ప్రధాన సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. హాస్టల్‌లో దాదాపు 300 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని, గదుల కొరత తీవ్రంగా ఉందని, హాస్టల్ ప్రాంగణంలో బండపరుపు లేక వర్షం కురిస్తే మొత్తం బురదమయంగా మారుతోందని, తద్వారా విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నట్లు హాస్టల్ వార్డెన్ ప్రమీల వివరించారు. అంతేగాక, ఇటీవల కురిసిన వర్షాలకు హాస్టల్ పక్కన ఉన్న ప్రహరీ కూలిపోవడంతో పిల్లలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటులో 588 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం 8 రౌండ్ల పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులు అందజేశారు.టోర్నీ డైరెక్టర్ స్వా తి, చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు, ఆర్గనైజర్ నందకిషోర్, గోవింద్,శ్రీనివాస్ కామిశెట్టి పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రేమ వివాహం

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్ ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్‌లో ప్రేమ వివాహం జరిగింది. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆర్.సుంకన్న, ముస్లిం మైనార్టీకి చెందిన ఎస్.కరిష్మ ఒక్కటయ్యారు. ఈ వివాహానికి యువతి తల్లిదండ్రులు ముంతాజ్, మహబూబ్‌బాషా, యువకుడి తండ్రి గిడ్డయ్య హాజరవ్వగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ వారితో పూలదండలు మార్పించి ప్రమాణపత్రాలు చదివించారు. వారి ప్రేమకు కులం, మతాలు అడ్డుపడలేదు. అనంతరం కొత్త దంపతులకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చారు.

బాలుడిపై పోక్సో కేసు

కర్నూలు (టౌన్): స్థానిక బుధవారపేటకు చెందిన 14 ఏళ్ల బాలుడిపై సోమవారం ఫోక్సో కేసు నమోదైంది. ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే గాకుండా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నం చేశాడు. భయాందోళనకు గురైన బాలిక గట్టిగా కేకలు వేయగా చుట్టుప్రక్కల వారు రావడంతో బాలుడు పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

చోరీ కేసు నమోదు

నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నమోదైంది. వివరాలు.. స్థానిక కొత్తబస్టాండ్ వెనుక ఉన్న దేవి అపార్ట్‌మెంట్స్‌లో రిటైర్డ్ ఉద్యోగి భవాని ప్రసాద్ నివసిస్తున్నారు. ఈ ఫ్లాట్‌లో కప్‌బోర్డు, మరమ్మతు పనులు చేపట్టేందుకు గత మే నెలలో కర్నూలుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు పనులు అప్పగించారు. అప్పట్లో వారు పనిచేసిన సమయంలో కప్‌బోర్డులో ఉన్న రూ.8 లక్షలు తీసుకుని ఉడాయించారు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు సోమవారం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చనిపోయిన బిడ్డను తిరిగిచ్చారని ధర్నా


మృతి చెందిన కావేరి

కర్నూలు(హాస్పిటల్): హాస్పిటల్ యాజమాన్యం చనిపోయిన బిడ్డను తమ చేతికి ఇచ్చారని ఆరోపిస్తూ నగరంలోని కిమ్స్ ఆస్పత్రి వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతలపల్లి గ్రామానికి పెద్దక్క, పెద్దరాజు కుమార్తె కావేరి (6)కి డెంగీ జ్వరం రావడంతో ఈ నెల 23న చికిత్స నిమిత్తం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్చారు. ఆదివారం వరకు చికిత్స కోసం రూ.4 లక్షల వరకు చెల్లించారు. సోమవారం ఉదయం మరి కొంత డబ్బు చెల్లించాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. ఇప్పటికే రూ.4 లక్షలు చెల్లించామని, ఇక తమ వద్ద డబ్బు లేదని, సమయం కావాలని కోరగా, డబ్బులు లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది. ఈ మేరకు కావేరిని అంబూ బ్యాగ్‌తో కుటుంబసభ్యులకు అందజేశారు. కొద్దిసేపటికే పాప మరణించడంతో చనిపోయిన బిడ్డను తమ చేతికి ఇచ్చారని వారు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి వద్ద ధర్నా చేయడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయమై ఆసుపత్రి సీఈఓ డాక్టర్ సునీల్ వివరణ ఇస్తూ.. కావేరికి తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చారని, బతికి ఉండగానే పాపను కుటుంబసభ్యులకు ఇచ్చామన్నారు. ఆక్సిజన్ తీసేసి నాలుగు రోజుల క్రితమే పాప చనిపోయిందని తమపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చికిత్సకు రూ.2.84 లక్షలు మాత్రమే చెల్లించారని, పేదవారని చెబితే రూ.2 లక్షలు వెనక్కి ఇచ్చామని వివరించారు.



పిచ్చుక గూళ్లు.. కాంక్రీట్ మేడలు

కల్లూరు: పిచ్చుకకైనా..మనిషికైనా సొంత గూడుంటే అదో నిశ్చింత. సొంతింట్లో ఉంటే క్షేమంగా ఉంటామన్న భావన ప్రతిఒక్కరిలో ఉంటుంది. పశుపక్ష్యాదులకు సైతం ఇందుకు అతీతం కాదు. సాధారణంగా వంకలు, వాగులు, నదుల పరివాహక ప్రాంతాల్లో చెట్లకు గిజిగాడు గూళ్లు కనిపిస్తుంటాయి. అయితే కల్లూరు అర్బన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ–2లోని వంద అడుగుల రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వర్షపు నీటితో కుంట ఏర్పడగా అక్కడి చెట్టుకు గిజిగాడు పక్షులు గూళ్లు అల్లుకున్నాయి. ఆ పక్కనే కాంక్రీట్ భవంతులున్నా పిచ్చుకలు గూళ్లు పెట్టుకోవడం విశేషం. ఈ గూళ్లు వాకింగ్ చేసే వారిని, రోడ్డుపై ప్రయాణించే వారిని అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

పడకేసిన పారిశుధ్యం


తడకనపల్లెలో పేరుకుపోయిన చెత్త


మరుగుదొడ్డి వద్ద సంచరిస్తున్న పందులు

కల్లూరు:మండల పరిధిలోని తడకనపల్లె గ్రా మంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం పేరుకుపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త ఉండడంతో పందులు స్వైర విహా రం చేస్తున్నాయి. వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారు లు చర్యలను చేపట్టి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పందుల స్వైర విహారం

ఓర్వకల్లు: స్థానిక పెండేకంటి నగర్‌లో చెత్త పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని కాలనీ వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో అనారోగ్యం పాలవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగరానికి చెందిన కొందరు వ్యక్తులు గ్రామ శివారులో పందులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు.పందులను గ్రామ శివారులో మేపుకోవాల్సిఉండగా, విచ్చలవిడిగా గ్రామంలోకి ప్రవేశిస్తున్నాయి. స్థానిక పెండేకంటి నగర్‌లోని సామూహిక మరుగుదొడ్డి,పోలీసు క్వార్టర్స్ వద్ద స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా కాలనీలోని ఇళ్ల మధ్య సంచరిస్తున్నాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఇళ్ల ముందున్న మురుగు కాల్వలు,మరుగుదొడ్డి వద్ద పైపులైన్ లీకేజీ కారణంగా మురుగుమయ అందులో పందులు పొర్లాడి ఇళ్ల మధ్యకు వస్తుండడంతో చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రిపూట మహిళలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వీటిని కుక్కలు వెంటాడుతూ, భౌ..భౌ మంటూ భీకరశబ్దాలు చే యడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు.ఏడాది నుంచి సమస్య తలెత్తుతున్నా ,అధికారులు పట్టించుకోవడం విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.